ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 04 | ఏప్రిల్ | 2024 పేజీలు 8

## లోక్ సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు




- -18న నోటిఫికేషన్ విడుదల
- -ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు జారీ
- -జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

2లో

# కాంగ్రెస్‌లో.. నిశ్శబ్ద యుద్ధం..!

తగ్గేదేలేదన్న రీతిలో ఇద్దరు మంత్రులు

అధిష్టానానికి ఇబ్బందిగా మారిన అభ్యర్థి ఎంపిక









## వర్గ కుంపటి రాజేస్తున్న ఎంపి సీటు

కాంగ్రెలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు కొత్తేమి కాదు. భిన్నాభిప్రాయాల నేపథ్యంలోనే వర్గాలు పురుడు పోసుకుని పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తాయి. వర్గాలకు నిలయమైన కాంగ్రెస్‌లో 2023 శాసన సభ ఎన్నికల సందర్భంగా గతంలో ఎన్నడులేనివిధంగా ఐక్యత కనిపించింది. ఆ ఐక్యత అపూర్వ విజయాన్ని అందించడంతో పాటు తొలిసారిగా ఖమ్మంజిల్లాకు సంబంధించిన ముగ్గురికి మంత్రి మండలిలో స్థానం దక్కింది. ఆ తర్వాత కూడా పర్యటనల సందర్భంగా మంత్రులు వ్యవహరించిన తీరు మనవాళ్లంతా కలిసే ఉన్నారన్న భావన కలిగించేలా ఉంది. కానీ ఖమ్మం పార్లమెంటు కోసం ఇద్దరు మంత్రులు పోటీపడుతున్న తీరు కార్యకర్తల్లో, నీ నా అనే భావాన్ని తీసుకొచ్చింది. -ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు మృతి



ప్రజాపక్షం/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లాలోని గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఎన్ కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఐజి సుందర్ రాజన్ ధృవీకరించారు. మంగళవారం తెల్లవారు జాము నుండే భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఇరు వర్గాల మధ్య సుమారు 8 గంటల పాటు హోరోహోరీ కాల్పులు చోటుచేసుకున్నాయి.మావోయిస్టుల వైపు నుండి కాల్పులు నిలిచిపోవడంతో

మిగతా 2లో..

- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, కిట్ బ్యాగ్‌లు స్వాదీనం
- పోర్చేలి అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న గాలింపు
- బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు
- హై అలెర్ట్

## ఇటుక బట్టీల్లో బలవుతున్న బాల్యం..!



బాల సంరక్షణాధికారులు ఎక్కడ

2లో

## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం..!

- -గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు
- -పట్టించుకోని అధికారులు

8లో



# కాంగ్రెస్‌లో నిశ్శబ్ధ యుద్ధం..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు కొత్తేమి కాదు. భిన్నాభిప్రాయాల నేపథ్యంలోనే వర్గాలు పురుడు పోసుకుని పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తాయి. వర్గాలకు నిలయమైన కాంగ్రెస్‌లో 2023 శాసన సభ ఎన్నికల సందర్భంగా గతంలో ఎన్నడులేనివిధంగా ఐక్యత కనిపించింది. ఆ ఐక్యత అపూర్వ విజయాన్ని అందించడంతో పాటు తొలిసారిగా ఖమ్మంజిల్లాకు సంబంధించిన ముగ్గరికి మంత్రి మండలిలో స్ధానం దక్కింది. ఆ తర్వాత కూడా పర్యటనల సందర్భంగా మంత్రులు వ్యవహరించిన తీరు మనవాళ్లంతా కలిసే ఉన్నారన్న భావన కలిగించేలా ఉంది. కానీ ఖమ్మం పార్లమెంటు కోసం ఇద్దరు మంత్రులు పోటీపడుతున్న తీరు కార్యకర్తల్లో, నీ నా అనే భావాన్ని తీసుకు వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో కార్యకర్తల పోస్టింగులు దానికి నేతల ఊతం, వర్గ భావనకు దారి తీసింది. ఎంపి సీటు కోసం కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులు గెలుపోటములపై ప్రభావం చూపకున్నా భవిష్యత్తులో పూర్వపు వర్గ పోరును చూసే అవకాశం మాత్రం తప్పక పోవచ్చు. ఖమ్మం పార్లమెంటు స్ధానానికి సంబంధించి కాంగ్రెస్ అభ్యర్ధి ఎంపిక రాష్ట్ర స్ధాయి దాటి జాతీయ స్ధాయిలోను చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ విజయం తప్పకుండా దక్కుతుందని అనుకుంటున్న నియోజక వర్గాల్లో ఖమ్మం ముందు స్ధానంలో ఉంది. అందుకే ఖమ్మం పార్లమెంటుకు పోటీ చేయాలనుకునే ఆశావాహుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఇక్కడి నుంచి టికెట్ తెచ్చుకుంటే చాలు గెలుపు ఖాయమన్న నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్, జెట్టి కుసుమకుమార్, వి. హన్మంతరావు తదితరులు పోటీ పడుతున్నారు. తుమ్మల తనయుడు యుగంధర్ మాత్రం అవకాశం ఇవ్వమని కోరాం ఇస్తే పోటీ చేస్తాం లేదంటే వదిలేస్తాం. అన్న ధోరణిలో ఉన్నట్లు సమాచారం. కానీ భట్టివిక్రమార్క సతీమణి నందిని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా పట్టుబడుతుండగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సోదరుడు ప్రసాదరెడ్డి కోసం అదే రీతిలో ఒత్తిడి తెస్తున్నారు. ఎవరెం చెప్పినా ఇద్దరు మంత్రులు తమ కుటుంబ సభ్యుల కోసం అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నది తమకు తోచిన పద్దతుల్లో టికెట్ సంపాదించేందుకు ప్రయత్నిస్తున్న విషయం సుస్పష్టం. ఇద్దరు మంత్రులు టికెట్ విషయంలో రాజీ ధోరణి ప్రదర్శించకపోవడంతో అభ్యర్ధి ఎంపిక కోసం కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఎన్ని దఫాలు సమావేశమైన ఖమ్మం అభ్యర్ధి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం రాలేదు. ఇద్దరు మంత్రులలో ఏ ఒక్కరు వదులుకునేందుకు సిద్దం కాకపోవడంతో అభ్యర్ధి ఎంపిక పీటముడి పడుతుంది. చివరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గేకు నిర్ణయాధికారాన్ని వదిలేసినట్లు సమాచారం. ఇద్దరు మంత్రుల కుటుంబ సభ్యులు ప్రధాన పోటీదారులుగా ఉండడంతో ఖమ్మం పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్‌లో ఇద్దరు మంత్రులకు సంబంధించి అనుకూల, వ్యతిరేక వర్గాలు తయారవుతున్నాయి. సామాజిక మాధ్యమాలలో మంత్రుల అనుచరులు పోస్టింగులు పెడుతున్నారు. మంత్రి తుమ్మల మాత్రం తన పని తాను చేసుకుపోవడంతో పాటు తాను ఇంచార్జిగా ఉన్న మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తుండగా భట్టి విక్రమార్క, పొంగులేటి తమ వారికి అవకాశం తెచ్చుకునే పనిలో ఉన్నారు. గడిచిన నాలుగు మాసాల్లో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వ్యవహార శైలి ఎటువంటి భిన్నాభిప్రాయానికి తావివ్వ లేదు. గత కాంగ్రెస్ నాయకత్వానికి భిన్నంగా క్యాడర్‌ను కలుపుకుని పోతూ వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ముందుకు సాగారు. అభ్యర్ధి ఎంపిక మధ్య ఇద్దరు మంత్రుల మధ్య జరుగుతున్న నిశ్శబ్ద యుద్ధం జిల్లాలో కాంగ్రెస్‌పై ఖచ్చితంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ప్రభావం గెలుపోటములను శాసించ లేక పోయినా ఇంత తాత్సర్యం జరిగిన తర్వాత ఎంపికయ్యే అభ్యర్ధి పై భిన్నాభిప్రాయం తప్పక పోవచ్చు. కాంగ్రెస్ జోష్‌లో అందులో ఖమ్మంలో పోటీ చేసే అవకాశం వస్తే చాలు గెలిచినట్లేనన్న భావన ఈ నిశ్శబ్ద యుద్దానికి దారి తీసింది. ఇదిలా ఉండగా పొంగులేటి ప్రసాదరెడ్డికి అవకాశం వస్తే ఖర్చు చేయగలరు కానీ మరీ నందినికి వస్తే ఎలా అన్న సందేహం కార్యకర్తల్లో వ్యక్తం కావడం కొసమెరుపు.

# ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు మృతి





**(మొదటిపేజీ తరువాయి)**

సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి, కోబ్రా బలగాలు సంఘటనా స్ధలం వద్ద సోదాలు చేయగా ముందు 4 మృత దేహాలు, ఆ తర్వాత మరో 4 మృతదేహాలు, అనంతరం మరో 2 మృత దేహాలు మంగళవారం రాత్రి నాటికి లభ్యమయ్యాయి. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం నిర్వహించిన సోదాల్లో మరో మూడు మృతదేహాలను లభ్యమయ్యాయి. దీంతో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోల సంఖ్య 13కి చేరుకుంది. మృతదేహాలను స్వాదీనం చేసుకున్న పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం రాయపూర్ ఆస్పత్రికి ప్రత్యేక హెలీకాప్టర్‌లో తరలించారు. కాగా మృతల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు మావోయిస్టులు గాయాలపాలై ఉంటారనే అంచనా వేస్తున్నారు. సంఘటనా స్ధలం నుండి భారీ పేలుడు పదార్ధాలు, మందుగుండు సామాగ్రి, తుపాకాలు, విప్లవ సాహిత్యం, కిట్ బ్యాగులు లభ్యమయ్యాయి. మృతులంతా పిఎల్‌జిఏ కి చెందిన మావోయిస్టులుగా ఆ రాష్ట్ర పోలీసు ఉన్నత వర్గాలు ప్రథామిక నిర్ధారణకు వచ్చారు.

**కొనసాగుతున్న గాలింపు చర్యలు...**

సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి,కోబ్రా బలగాలు పోర్చోలి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. ఆకురాలి అడువులు పలుచబడటంతో కూంబింగ్ సులువుగా మారింది. మావోయిస్టుల స్ధవరాన్ని కనుగొన్న భద్రతా బలగాలు వారిని చుట్టుముట్టి మట్టు పెట్టి పై చేయి సాధించాయి. కాల్పుల అనంతరం మిగిలిన మావోయిస్టులు అటవీ ప్రాంతం లోనికి జారుకున్నారు. వారి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మరో ప్రక్క ఛత్తీగఢ్ రాష్ట్రంలో ఉన్న అన్ని బేస్ క్యాంపుల భద్రత కట్టుదిట్టం చేశారు. అదనపు బలగాలను బేస్ క్యాంపులకు తరలిస్తున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్ తెలంగాణ ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది.

**బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు ...**

ఛత్తీస్‌గఢ్ ఎదురు కాల్పుల్లో 13 మంది మావోయిస్టులు మృతి చెందడంతో వారు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ ఎన్ కౌంటర్‌ను మావోయిస్టు కేంద్రకమిటీ సైతం సీరియస్‌గా తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణఛత్తీస్‌గఢ్ ఆంధ్రప్రదేశ్ ఒడిస్సా రాష్ట్రాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమైన చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో బంద్ ప్రభావం ఓ మోస్తరుగా కనిపిస్తోంది. దీంతో భద్రతా బలగాలు అడుగడుగునా సోదాలు నిర్వహిస్తూ వాహన తనిఖీలు చేస్తున్నారు.

**హై అలెర్ట్...**

ఛత్తీస్‌గఢ్ అడువులు తుపాకులు మోతతో దద్దరిల్లడం, 13 మంది మావోయిస్టులు హతం కావడంతో మావోయిస్టు పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో హై అలెర్ట్ కొనసాగుతోంది. సహచరులను కోల్పోయిన మావోయిస్టు పార్టీ అదను కోసం ఎదురు చూసి ఎదురుదాటికి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భద్రతా బలగాలు ముప్పేట దాడికి పూనుకుంటున్నాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దును స్వాదీనం చేసుకున్నారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ అడవుల నుండి తెలంగాణ, మహారాష్ట్ర, అటవీ ప్రాంతాల్లోకి మావోయిస్టులు జారుకునే అవకాశం ఉండటంతో ఆ ప్రాంతాల్లో అదనపు బలగాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల వేళ జరుగుతున్న పరిణామాలతో అటవీ ప్రాంతాల్లోని ప్రజలు ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు.

# ఇటుక బట్టీల్లో బలవుతున్న బాల్యం..!





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** మండల పరిధిలోని కారుకొండ హేమచంద్రాపురం, జూబ్లీపురం, మాదిగప్రోలు అని శెట్టిపల్లి ప్రాంతాల్లో కొన్నేళ్లుగా ఇటుక బట్టీల వ్యాపారం దర్జాగా సాగిస్తున్నారు. బట్టీదారులు కార్మికులను వేర్వేరు ప్రాంతాల నుండి ఇతర రాష్ట్రాల నుండి తీసుకొస్తున్నారు. కార్మికశాఖ నుండి శాఖాపరమైన అనుమతులు లేకుండానే కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. బట్టీల్లో పనిచేసే కార్మికులు కుటుంబాలతో సహా పని నిమిత్తం వస్తున్నారు. వారి బాగోగులను చూడాల్సిన బట్టీదారులు బాద్యతను గాలికి వదిలేసి బాల్యంలో ఉన్న సైతం బట్టీల్లో పనులకు వారిని ఉపయోగిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా కొంతమంది ఇటుక బట్టీల యజమానులు వ్యవహరిస్తున్న తీరు అందరిని ఆశ్చర్చపరుస్తుంది. విద్యాబుద్దులు నేర్పించి మీ దేవాలయం లాంటి పాఠశాలలను సైతం బట్టీల కోసం వినియోగించే కలపను దాచిపెట్టుటకు ఉపయోగిస్తున్నారు. కొన్ని ఇటుక బట్టీలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ చెరువుల, కుంటల నుండి అక్రమంగా మట్టి తోలకాలను సైతం నిర్వహిస్తున్నారు. బాల కార్మికుల కోసం ప్రభుత్వం రకరకాల అధికారులను నియమించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఎన్ని చట్టాలు తీసుకొచ్చినప్పటికీ ఇటువంటి వారిలో మార్పు రావడం లేదు. ఎందుకో పలక, బలపం పట్టే వయసులో పిరికెడు మట్టి పిసుకుతూ పనిచేస్తున్న బాలలు పసివాడితో పనిచేయించడం ఏమిటని కొంత మంది గ్రామ ప్రజలు, పాత్రికేయులు ఇటుక బట్టీదారులను ప్రశ్నించగా వారరి దగ్గర సమాధానం లేదు. ఇప్పటికైనా బాల సంరక్షణ అధికారులు పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారికి విద్యాబుద్దులను నేర్పించాలని కొంతమంది మాట.

# లోక్ సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 26న నామినేషన్ల స్క్రూటి ఉంటుందన్నారు. నూతన కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు అక్కడ నామినేషన్ ఫారాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పోటీ చేసే అభ్యర్ధులు దేశంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలని, ప్రపోజర్లు ఆయా నియోజక వర్గాల్లో ఓటర్లుగా నమోదై ఉండాలన్నారు. ఓటరు జాబితాలో ఓటరుగా నమోదైంది లేనిది తనిఖీ చేసుకోవాలన్నారు. ఈ నెల 14 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని అప్పటి వరకు ఆలస్యం చేయకుండా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేర్పులు, మార్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఫిబ్రవరి ఐదు వరకు 52,987 ఎపిక్ కార్డులు పంపిణీ చేసినట్లు, 54,866 కార్డులు ప్రింటింగ్‌కు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 1459 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వాటిలో అన్ని కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. 600 పోలింగ్ కేంద్రాల్లో బాత్‌రూం, మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ దఫా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామన్నారు. ఓటు ఒక నియోజక వర్గ పరిధిలో ఎన్నికల విధులు మరో నియోజక వర్గ పరిధిలో ఉన్న వారికి ముందుగా స్పెషల్ క్యాజువల్ లీవును మంజూరు చేస్తామని వారు ఆ నియోజక వర్గానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈడిఎస్ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ ) లు జారీ చేసిన ఉద్యోగులు మాత్రం తాము విధుల్లో ఉన్న పోలింగ్ కేంద్రంలోనే ఇవిఎంలో ఓటు వేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇవిఎంల నిర్వహణపై హ్యాండ్ ఆన్ శిక్షణ ఇచ్చామన్నారు. ఇవిఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామన్నారు. శిక్షణ కొరకు 146 ఇవిఎంల ను కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సి విజిల్, టోల్ ఫ్రీ 1950 పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ జిల్లాలో 12 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 15 ఎస్ఎస్‌టి, 15 ఎఫ్ఎస్‌టి, పోలీసుల ద్వారా ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 54 కేసులు నమోదు చేశామన్నారు. 359 లీటర్ల మద్యం, ఒక కిలో గంజాయి, రూ. 77.10 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. రూ. 50వేలకు పైబడి నగదుతో ప్రయాణిస్తున్నప్పుడు సంబంధిత డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాలేదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈవో వినోద్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిపిఆర్‌వో ఎంఎ గౌస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

## జిల్లా కలెక్టర్ విపి గౌతమ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోని 1459 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా ఇవిఎం యంత్రాల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం సెగ్మెంట్ పరిధిలోని 355 పోలింగ్ కేంద్రాలకు గాను 24 శాతం అదనంతో 440 బ్యాలెట్ యూనిట్లు , 440 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంతో 497 వివి ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. పాలేరు సెగ్మెంట్ పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలకు 24 శాతం అదనంతో 359 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంతో 375 వివి ప్యాట్లు, మధిర సెగ్మెంట్ పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలకు 25 శాతం అదనంతో 335 బ్యాలెట్ యూనిట్లు, 335 కంట్రోల్ యూనిట్లు 40 శాతం అదనంతో 352 వివి ప్యాట్లు, వైరా సెగ్మెంట్ పరిధిలో 252 పోలింగ్ కేంద్రాలకు 25 శాతం అదనంతో 315 బ్యాలెట్ యూనిట్లు, 315 కంట్రోల్ యూనిట్లు 40 శాతం అదనంతో 352 వివి ప్యాట్లు, సత్తుపల్లి సెగ్మెంట్ పరిధిలో 294 పోలింగ్ కేంద్రాలకు 25 శాతం అదనంతో 367 బ్యాలెట్ యూనిట్లు, 367 కంట్రోల్ యూనిట్లు 40 శాతం అదనంతో 411 వివి ప్యాట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించబడినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రకారం ఈవిఎంల ను వేరు చేసి భద్రత నడుమ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారంతో సంబంధిత స్ట్రాంగ్ రూములకు తరలించినట్లు తెలిపారు. ఖమ్మం, పాలేరు సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా సెగ్మెంట్‌కు సంబంధించి వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో సత్తుపల్లి సెగ్మెంట్ కు సంబంధించి జ్యోతి నిలయం హైస్కూల్‌లో, మధిర సెగ్మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు 146 ఇవిఎంలను కేటాయించామన్నారు. ఈనెల 18న నోటిఫికేషన్ వెలువడనున్నట్లు , ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూటీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఎనిమిది నుండి హెల్ప్ డెస్క్ ప్రారంభించి నామినేషన్ ఫారాలను అందజేస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలుకు ఈసిఐ నుండి వచ్చిన ప్రింటెడ్ ఫారాలను అందజేస్తామని తెలిపారు. పోటీ చేయు అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండాలని, ప్రపోజర్లు ఆయా నియోజక వర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. ఓటు నమోదుకు ఏప్రిల్ 14 వరకు గడువు ఉన్నప్పటికీ అప్పటి వరకు ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతుల కొరకు 48 గంటల ముందస్తుగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఎంఎల్‌సి ఎన్నికలకు గురువారం తుది ఎలక్టోరోల్ పబ్లికేషన్ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఫైనల్ పబ్లికేషన్ రాగానే కాపీ అందజేస్తామన్నారు. ఓటరు హెల్ప్ లైన్, సి విజిల్ యాప్ లకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిపై ఏజెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, జెడ్పి సిఈవో వినోద్, డిఆర్‌డివో సన్యాసయ్య, ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## అవగాహన సదస్సులో ఏసిపి ఫణీంద్ర






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సైబర్ క్రైమ్‌లకు మానవ నిర్లక్ష్యం, అవగాహన లేమి ప్రధాన కారణాలని సైబర్ క్రైమ్ ఏసిపి సిహెచ్ ఆర్‌వి ఫణీంద్ర తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు బుధవారం సైబర్ క్రైమ్ పోలీసులు నగరంలోని ఎస్‌బిఐటి కళాశాలలో విద్యార్థులకు పెట్టుబడి, హోటల్ రేటింగ్, లోన్ యాప్, సైబర్ మోసాలు, సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ఇంటర్నేట్ వినియోగదారులను చైతన్యపరిచేందుకు సైబర్ జాగృక్త దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి ఫణీంద్ర మాట్లాడుతూ డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి పరంగా ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం ఒకటన్నారు. వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి, ఇంటర్నేట్ యొక్క పెరిగిన వినియోగంతో సైబర్ నేరాల ప్రమాదం పెరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల్లో 60 శాతం ఆర్థిక మోసాలకు సంబంధించినవేనని తెలిపారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి సైబర్ జాగృక్త దివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆయన తెలిపారు. సైబర్ బెదిరింపుల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి కొన్ని భద్రతా చిట్కాలు పాటించాలన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితుల నుండి వచ్చే స్నేహితుల అభ్యర్థనలను అంగీకరించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీ యుపిఐ పిన్, ఓటిపి, ఏటిఎం పిన్‌ను ఎవరితో పంచుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల భారీన పడితే www.cybarcrime.gov.in లో నివేదించాలన్నారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాలు అధికంగా అంతర్జాలాన్ని ఉపయోగించి జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. పరిచయం లేని కాల్స్, టెక్ట్స్ సందేశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం ను నిర్వహించారు. విద్యార్థులు, ఆటా , పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన జరుగుతుందని అన్నారు. విద్య కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించాలని ఆయన సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ బోడేపూడి శ్రీనివాస రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జీ.రమేష్, పాఠశాల చైర్మన్ బత్తుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ ప్రారంభించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో వినోద్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిపిఆర్‌వో ఎంఏ గౌస్, అదనపు డిపిఆర్‌వో వి. శ్రీనివాసరావు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# చల్లా వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటు



**ప్రజాపక్షం/ చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కోమట్ల గూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు మృతి వార్త తెలుసుకున్న సిపిఐ నాయకులు మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకునిగా చల్లా వెంకటేశ్వర్లు సిపిఐ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, పార్టీ మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, కార్యదర్శి వేముల జానకి, రామయ్య, రామిరెడ్డి, బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 230 కేజీల గంజాయి దహనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేతృత్వంలో బుధవారం శాస్త్రీయ పద్ధతుల్లో దహనం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన 230 కిలోల ఎండు గంజాయిని పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో పోలీస్ ఫైరింగ్ రేంజ్ మంచుకొండ అటవీ ప్రాంతంలో నిర్వీర్యం చేశారు. ఖమ్మం వన్‌టౌన్ తల్లాడ, వైరా పోలీస్ స్టేషన్లకు సంబంధించి 13 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా విక్రయాలు జరిపిన నేరస్తులను అరెస్టు చేసినట్లు అడిషనల్ డిసిపి నరేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఠానాల్లో నిల్వ ఉన్న గంజాయి సరుకును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ నరేష్ కుమార్, ఏసిపి సాంబరాజు, టాస్క్‌ఫోర్స్ ఏసిపి మల్లయ్య, సిఐ స్వామి, రఘునాథపాలెం సిఐ శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలుతున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ముదిగొండ మండలం నుంచి అక్రమంగా నేలకొండపల్లి మండలం కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టరు లను స్తానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం లోని పెద్దమండవ గ్రామానికి శివారు లో ఉన్న ఏరు ప్రాంతంలో ఇసుక ను మూడు ట్రాక్టర్లు లో బుధవారం నేలకొండపల్లి కి తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు మండంలోని గువ్వలగూడెం వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్లు యాజమానులతో పాటు, డ్రైవర్లు పై కేసు నమోదు చేస్తున్నట్లు నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు.

# ఆటలో విద్యార్థికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని ఓ ప్రవేట్ పాఠశాలలో విద్యార్థులు ఆటలు ఆడుతుండుగా ప్రమాదవశాత్తు విద్యార్థి కి తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. స్తానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లో ఓ ప్రవేట్ పాఠశాల లో 8 వ తరగతి చదువుతున్న సంధీఫ్ అనే విద్యార్థి బుధవారం పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతుండుగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో చేయ్యి కి తీవ్ర గాయమైంది. వెంటనే నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

# బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిని గెలిపించండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ పర్యటించారు. మదన్‌లాల్‌కు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాపాలను గాలికొదిలేసిందని ఆరోపించారు. రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

## మేట్ల కనుసన్నల్లో ఉపాధి పనులు



ప్రజాపక్షం/కారేపల్లిః కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక పథకమైన ఉపాధి హామీ పథకం ద్వారా పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన పథకం ఇప్పుడు మెట్ల కనుసన్నల్లో నడుస్తుంది. అనేక గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా ఎప్పటి నుంచి పనిచేస్తున్నా పేద ప్రజలు ఉపాధి కార్డులను గల్లంతు చూసి వారికి ఉపాధి లేకుండా చూస్తున్నారు. గ్రామాల్లో ఉండే మెట్లు వారి వారి గ్రామాల్లో ఉండే పేద ప్రజలతో మమేకంగా ఉండి ఉపాధి కల్పించాల్సిన వారు వారి యొక్క వ్యక్తిగత కలహాల ద్వారా వారి యొక్క కార్డులను గల్లంతు చేసి వారి ఉపాధి లేకుండా చేస్తున్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండలం పెద్ద కోరుకొండిలో బాల్యవివాహాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రెవెన్యూ పోలీస్ సెర్ప్ ఐకెపి శాఖల వారి ఆధ్వర్యంలో బాల్య వివాహం జరగబోతున్న ఒక బాలిక వివాహాన్ని బుధవారం అడ్డుకున్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ అధికారిని సంధ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆర్ ఐ స్టాలిన్ , ఏఎస్ఐ చారి, వివోఏ నాగమణి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు రత్నకుమారి, పద్మ కుమారి, ఎంపిటిసి చిట్టిబాబులు ఆ గృహానికి వెళ్లి తల్లిదండ్రులకు బంధువులకు అవగాహన కల్పించారు.

## ఉపాధి, మంచినీటి సౌకర్యాలపై సమీక్ష



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ లో సౌకర్యాలపై, గ్రామాలలో మంచినీటి సౌకర్యాలపై ఎంపీడీవో చంద్రశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని నర్సరీలు జూన్ చివరికల్లా మొక్కలు నాటే విధంగా తయారు చేయాలని, ఉపాధి లో మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, గ్రామపంచాయతీల్లో పోలింగ్ బూత్‌లు, సి విజిల్ యాప్ పై అవగాహన, వేసవిలో గ్రామాలలో కల్పించే మంచి నీటి సౌకర్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఓ సురేష్ బాబు, ఈజీఎస్ ఏపీవో హేమమాలిని, జే ఇ పుల్లారావు, కార్యదర్శులు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తాటి ముంజలకు పెరిగిన గిరాకీ



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు లోని జాతీయ రహదారి వెంబడి తాటి ముంజలకు భలే గిరాకి పెరిగింది. కల్లూరు లోని జాతీయ రహదారి వెంబడి తాటి ముంజలు అమ్మకం దారులు వేసవి కాలం కావడంతో కొనుగోలుదారులు అధికంగా కొంటున్నారు. కల్లూరు లోని పెనుపెల్లి, కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి మండలాలకు చెందిన వారు మార్కెట్‌గా పెట్టి అమ్మకం చేస్తుండడంతో తిరువూరు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తాటి మంజలను కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో వచ్చే ఈ తాటి ముంజల వలన నీరు, లవణాలు, విటమిన్లు, వీటిలో అధికంగా లభిస్తాయని వీటి వలన ఆరోగ్యానికి ఎంతో బలంగా ఉంటాయని వైద్యులు సలహాలు సూచనలు చేస్తున్నారు. తాటి ముంజల వలన వేసవిలో తట్టుకునేందుకు తాటి ముంజ శరీరానికి ఎంతో ఉపయోగకారిగా ఉంటాయని వైద్యులు సలహాలు సూచనలు చేస్తూ ఉన్నారు. సీజన్ లో వచ్చే ఈ తాటి ముంజలు ప్రతి వ్యక్తి తినాల్సిన అనుభవించాల్సిన తాటి ముంజని వారు పేర్కొంటున్నారు. మండల పరిధి లోని అధికంగా బత్తులపల్లి ,తాళ్లూరు, వెన్నవల్లి, పెద్ద కోరుకొండి, కొర్లగూడెం, ముచ్చవరం, ఎర్ర బంజర, చంద్రుపట్ల, రఘునాథ్ గూడెం తదితర గ్రామాలలో తాటి ముంజలు అధికంగా లభిస్తాయి. వీటిని కొందరు వ్యక్తులు ఆసరాగా చేసుకొని ముంజలను కొట్టుకొని వచ్చి కల్లూరు లోని కూడలి ప్రాంతాలలో ఒక్కో డజను 50 నుంచి 100 రూపాయల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే అదునుగా ఒకేసారిగా డజను ముంజలు ధర పెంచారు. దీంతో కల్లూరు లోని ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చేసి కొనుగోలు చేసుకోవడంతో గంటలో అయిపోతున్నవి. ముంజలు వస్తున్న సమయాన్ని బట్టి ఇతర ప్రాంతాల వారు వచ్చి కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. సీజన్ పంట కావున ప్రతి ఒక్కరు తినాల్సిందే అని ఉండటంతో ప్రతి ఒక్కరు మధ్యాహ్న సమయంలో కొనుగోలు చేసుకుని తింటున్నారు. దీంతో డిమాండ్ పెరగడంతో ధర పెంచారు. జాతీయ రహదారిపై రాకపోకలు చేస్తున్న వాహనదారులు ఆపి ఎంత ధర అయినా సరే కొనుక్కొని వెళ్తున్నారు.

# నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః ఎన్నికల నిబంధనలు పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పోలీస్ ఎన్నికల శాఖ అధికారులను కోరారు. నగదు లావాదేవీల విషయంలో పోలీస్ ఈసి అధికారులు ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బుధవారం క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు, ఎమ్మెల్యేలు కలిసి వినతిపత్రం అందించి తమ ఇబ్బందులు వివరించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వ్యాపారం చేసుకున్న అనంతరం వచ్చిన డబ్బులను మరుసటి రోజు బ్యాంకులో జమ చేయడం, వ్యాపారుల నిత్య ప్రక్రియ అని, ఎన్నికల నియమాల పేరుతో పోలీసులు, ఈసి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వ్యాపారుల డబ్బులను సీజ్ చేస్తున్నారని, డబ్బులతో బ్యాంకుకు వెళ్లిన వారిని సైతం బయటకు పిలిచి సీజ్ చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఇది సరైంది కాదన్నారు. ఆధారాలు చూపినప్పటికీ డబ్బులు తిరిగి ఇచ్చే పరిస్థితి లేకుండా పోతుందని, ఈ విషయంలో వ్యాపారులకు మినహాయింపు ఇవ్వాలని, అనుమానం ఉంటే అక్కడికక్కడే పాత్రలు పరిశీలించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చాంబర్ అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కంభంపాటి రవి, ఉపాధ్యక్షులు అశోక్ రాఠీ, జాయింట్ సభ్యులు పల్లపోతు సాయి, మాజీ చాంబర్ కన్వీనర్ గుడాల అచ్యుతం, సభ్యులు పల్లపోతు ప్రేమసాయి, ముక్కా కనకేశ్వరరావు, రాంకుమార్ శారద, నారాయణదాస్, గోపాల్ పంచార్య, కూర శ్రీధర్, బ్రిజ్ లాల్ అగర్వాల్మ, హేష్ గోయల్, పెమ్మసాని అనిల్, విజయ రాఠీ తదితరులు ఉన్నారు.

## జర్మనీ, స్విట్జర్లాండ్ ఫ్యాక్టర్‌వైతో శ్రీ చైతన్య విద్యాసంస్థ ఒప్పందం




ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నేకల్‌పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వారు జర్మనీ,స్విట్జర్లండ్ దేశాలకు చెందిన ఫ్యాక్టర్‌వైతో ప్రతిష్టాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం హైదరాబాద్‌టాస్క్ ఆధ్వర్యంలో టీహబ్‌లో జరిగిన సదస్సులో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పన్నాల కృష్ణమూర్తి తెలియజేశారు. అదేవిధంగా ఒప్పందంలో భాగంగా జర్మనీ,స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన ఫ్యాక్టర్‌వై, మా కళాశాల ఐపి క్వాలిటిటీల్యాబ్ ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ ఒప్పందాన్ని టాస్క్ సిఈఓ శ్రీకాంత్‌సిన్హా, ఫ్యాక్టర్ వై ప్రతినిధులు ఫిలిప్ అస్యూమ్స్,మార్కోమర్చిన్, కళాశాల సిఈఓ డాక్టర్ పుట్ట శ్రీనివాస్,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్‌లు కలిసి కదుర్చుకున్నారు. దీనిపై కళాశాల డైరెక్టర్ శ్రీ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడా రు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు,అధ్యాపకులు పరిశోదనలు చేయడంలో ఎంతో తోడ్పాటుని అందిస్తుందన్నారు. తద్వారా ఉన్నత విద్యాను అభ్యసిచండంలో విద్యార్థులకు ఇది సహకారంగా ఉంటుందన్నారు. స్థాపించిన సంవత్సర కాలంలోనే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందడం తమ కళాశాలకు ఎంతో అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ వి.సుదర్శన్, సిహెచ్ కృష్ణ ప్రసాద్, ఏఓ వైశాలి, హరిప్రసాద్, శ్రీకుమార్,భావన పాల్గొన్నారు.

# కల్లూరులో పెరుగుతున్న వడదెబ్బ బాధితులు





ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు లోని రోజువారీగా పదిమందిలోపు వడదెబ్బ బాధితులు పెరుగుతున్నారని వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. నిర్మాణ కార్మికులు, శుభకార్యాలకు వెళుతున్న ప్రయాణికులు, లారీ ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు, మామిడి తోటల కాపలాదారులు, వృద్ధులు, పసి పిల్లలు, దూర ప్రయాణం చేసేవాళ్లు రోజువారీగా కల్లూరులో 10 మందిలోపు వడదెబ్బకు గురై ఆసుపత్రి పాలవుతున్నారని వైద్యులు పేర్కొన్నారు. కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తమ ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు. వడదెబ్బ ప్రమాదకరమని దానిని నిర్లక్ష్యం చేయవద్దని, ఉదయం 11 గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తర్వాత బయటకు రావాలని ప్రజలను కోరుతున్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్త కాపాడుకోవాలని కోరారు. తరచుగా నిమ్మరసం, పండ్ల రసాలు, మజ్జిగ త్రాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మద్యం జంక్ ఫుడ్ జోలికి పోవద్దని, పగటిపూట ఇంటికి కిటికీలు మూసివేసి ఉంచాలని, కూలర్లు వాడుకోవాలని, రాత్రివేళ కిటికీలు తీసి ఉంచుకోవాలని కోరారు. అత్యవసరమైతే చల్లని నూలు వస్త్రాలు, టోపీ, గొడుగు వేసుకొని బయటకు రావాలని ప్రజలను కోరారు. వేసవి పట్ల సలహాలు, సూచనలు పాటించి తమ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అదేవిధంగా హెల్ప్ లైన్ డెస్క్ కు జిల్లా వైద్య శాఖలో సిద్ధంగా ఉందని వైద్యులు సూచించారు. 8501003838 మరియు 8639522447 అనే నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## వైరా నియోజకవర్గ బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం



ప్రజాపక్షం/వైరాః వైరా పట్టణం పరుచూరి గార్డెన్‌లో నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలోజరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు ఎంపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ హాజరయ్యారు. వినోద్‌రావు మాట్లాడుతూ నేను ఇక్కడే పుట్టి పెరిగిన రైతు కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిని అని, గత 30 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉంటున్న వ్యక్తిని అని మోడీపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాదరణ నాపై కూడా జిల్లా ప్రజల్లో ఉంటుందని, నన్ను ఎంపిగా గెలిపిస్తే జిల్లాకు కేంద్ర నిధులు తెచ్చి ఎటువంటి అవినీతి లేకుండా మరింత అభివృద్ధి చేస్తానని, దేశవ్యాప్తంగా బిజెపి గెలుచుకోబోయే 400 సీట్లలో ఖమ్మం కూడా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు రమేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, టిడిపి నేత సురేష్, అయ్యప్ప భక్తుల ప్రచార సమితి అధ్యక్షులు తాండ్ర రాంప్రసాద్ గురుస్వామి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు నున్నా రవికుమార్, భూక్యా శ్యామ్‌రాథోడ్, జిల్లా కార్యదర్శి బండారు నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొవ్వూరు నాగేశ్వరరావు, పార్లమెంటు ప్రభారి శ్రీకాంత్, వైరా ప్రభారి రుక్మారావు, పార్లమెంటు కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, మండల అధ్యక్షులు బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం సరుకులతో కుచ్చుటోపీ..!

**-తూతూమంత్రంగా తనిఖీలు**



ప్రజాపక్షం/మణుగూరుః కొంత మంది సూపర్ మార్కెట్, కిరాణా నిర్వాహకుల నాసిరకపు సరుకులతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. మణుగూరు మండల కేంద్రంలో ధనార్జనే ధ్యేయంగా కొంత మంది కల్తీ కేటుగాళ్లు మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల తూనికలు కొలతల అధికారులు మణుగూరు పట్టణంలో ఓ సూపర్ మార్కెట్లో తనిఖీలు నిర్వహించి కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు ఒక ఆయిల్ ప్యాకెట్ మాత్రమే తూకంలో తేడా ఉందని సంబంధిత ఆయిల్ కంపెనీకి నోటీసులు పంపుతామని తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. గడువు ముగిసిన (ఎక్స్ పైరీ డేట్) అయిపోయిన నిత్యవసర సరుకులకు తమ శాఖకు ఏ సంబంధం లేదని ఫుడ్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. పట్టణంలో తూనికల కొలతల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో కొంతమంది వ్యాపారులు అప్రమత్తమై దుకాణాలు బంద్ చేసుకున్నారు. ఇది ఇలా ఉంటే .. మండల కేంద్రంలోని వ్యాపారులు మాత్రం నాణ్యత ప్రమాణాలు గాలి కొదిలి నాసిరకపు నిత్యవసర సరుకులను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.పేరు ప్యాకింగ్ గడువు (ఎక్స్ పైరీ డేట్ )తేదీ లేకుండానే ఏజెన్సీ గిరిజన ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంతమంది సూపర్ మార్కెట్, కిరాణా నిర్వాహకులు దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. తూనికలు కొలతల్లో తేడాలు, బియ్యం, పప్పు, కారం, నూనె చివరకు అల్లం పేస్ట్ సైతం కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీ నూనెలు వాడడం వలన గుండెపోటు, క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సర్వం కల్తీమయం అవుతున్నాయి. మరికొన్ని కిరాణం, సూపర్ మార్కెట్లలో గడువు ముగిసిన వంట నూనెలు, నిత్యావసర సరుకులు యదేచ్ఛగా, గడువు తేదీ, ప్యాకింగ్, మారుస్తూ విక్రయాలు చేస్తూ లక్షలు గడిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా బ్రాండెడ్ నూనెల ముసుగులో కల్తీ నూనెలో అమ్ముతున్నట్లు తెలుస్తోంది. నాణ్యత లేని నూనెలు, కాలం చెల్లిన నిత్యవసర సరుకులతో ప్రజలు అనారోగ్యాల పాలు అవుతారని తెలిసిన లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలతో వ్యాపారులు ఆడుకుంటున్నారు. మరి కొందరు వ్యాపారస్తులు నాణ్యత లేని, నిత్యావసర సరుకులను (నాణ్యతలేని మసాలా దినుసులు) షాపుల్లో, తమ తమ ఇళ్లల్లో, రహస్య ప్రదేశాలలో తయారు చేసి దర్జాగా ఏజెన్సీ గ్రామాలకు సరఫరా చేయడంతో పాటు పట్టణంలో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఆహార ప్రమాణాల చట్టం 2006ను అనుసరించి ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నియంత్రణ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎలాంటి ప్యాకింగ్, ఆహార పదార్థాలు, మార్కెటింగ్ చేయాలన్న సంస్థ నుండి లైసెన్స్ తప్పనిసరి తీసుకోవాలి. పట్టణంలోని కొంతమంది వ్యాపారులు ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండానే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి.. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న కిరాణా, సూపర్ మార్కెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం 'సి విజిల్' యాప్




ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీవిజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం అని తహాశీల్దార్ బి.రాంప్రసాద్ అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాపంచాయతీపరిధిలో గల ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలలో ఓటర్,స్వీప్‌పై విద్యార్థినిలకు ఎన్నికల అధికారులు అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉల్లంఘనలకు పాల్పడుతూ అక్రమాలు చేస్తున్న వారి ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేస్తే 100నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి ఫిర్యాదు దారుడికి సమాచారం అందిస్తారన్నారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్కాడ్‌తో పాటు సంబధిత విభాగాలకు చేరుతుందన్నారు. వివిధ పార్టీ అభ్యర్థులు,నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురి చేసినా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా స్పికర్లు వాడటం,కులమతాలను రెచ్చగొట్టె వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఉల్లంఘనలకు పాల్పడిన యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల కమిషన్ కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు పూర్తి అవగాహణను కల్పించుకుని,పౌరులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ రవీందర్, ఎంపీఓ రాజారాం, ఆర్ఐ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరమణ, వివిధ విభాగాలకు చెందిన హెచ్‌ఓడిలు,అధ్యాపకులు,విద్యార్థినిలు పాల్గొన్నారు.

## 5న జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ మధిర : ఈ నెల 5న ఖమ్మంలో జరిగే ఎస్ఎఫ్ఐ 46వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం శ్రీనిధి కళాశాలలో ఎస్ఎఫ్ఐ డివిజన్ మహాసభ బోడ వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో విద్యను భ్రష్టు పట్టిస్తుందని, విద్యా విధానంలోకి మతోన్మాద విధానాలను చెప్పించి విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ అనేక రాష్ట్రాల్లో యూనివర్సిటీల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని, ఈ పోరాటాలకు విద్యార్థుల నుండి పూర్తి మద్దతు లభించాలన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఉండే విధంగా విద్యార్థిలను తీర్చి దిద్దాల్సిన అవసరం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా రంగ సంస్థలపై ఉందన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణను రూపొందించటం జరుగుతుందని, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 21మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవటం జరిగింది.ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వీరేందర్, బోడా వెంకట్,శ్రీనివాస్, కోట చైతన్య, కార్తీకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు గోపి, సుధీర్, నాగమురళీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నామ



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్‌కు చెందిన పత్రికా విలేకరి తమ్మారపు బ్రహ్మం, కృష్ణవేణిల కుమార్తె లక్ష్మీ , రాజశేఖర్ల నూతన దంపతులను ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావులు బుధవారం ఆశీర్వదించి పట్టు వస్త్రాలను అందచేశారు. ఈకార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషనం, పాలవంచ రాజేష్, భానుప్రతిప్, తన్నీరు రవికుమార్, తాళ్ళూరు హరీష్, తమ్మారపు వెంకటేశ్వర్లు, బోయిన శేఖర్‌బాబు, ఓరుగంటి ఈశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల్లో ఫారెస్ట్ అధికారుల ముమ్మర తనిఖీలు



ప్రజాపక్షం/మణుగూరుః అశ్వాపురం మండలంలోని సీతారామాపురం. గొల్లగూడెం గ్రామాల్లోని ఇటుక బట్టీలను బుధవారం ఫారెస్ట్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి రమేష్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా చెట్లను మరియు అడవి కర్రను నరికి ఇటుక బట్టీలకు ఉపయోగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని బట్టీల యజమానులకు తెలియ జేశారు. ఇటుక బట్టీలలో ప్రతిరోజు తనిఖీలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండలం చిన్న రాయిగూడెం, సమితి సింగారం, రామానుజవరం, మణుగూరు, పగిడేరు, చిక్కుడుగుంట, గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం వ్యవసాయ ఏడిఏ తాతారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఏఈఓ పవన్, రవి, సీఈవో జ్ఞాన దాసు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.1లక్ష సీజ్

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పెద్దతండాపంచాయతీపరిధిలోని సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన పంది గోపాల్‌రావు అటు నుంచి వెంకటగిరి వైపు ద్వీచక్రవాహనంపై రూ.1లక్షను ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకువెళుతుండగా సీజ్ చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అలాగే నగదును ఎన్నికల అధికారులకు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి కోతులగుట్ట సబ్ స్టేషన్‌పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు, తల్లంపాడు, మద్దులపల్లి లైటింగ్ ఫీడర్‌లు, ఏజీఎల్, ఐడీఎస్ ఫీడర్లు, గుదిమళ్లలోని 11కేవీ లైన్,ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులలో భాగంగా విద్యుత్ సరఫారకు అంతరాయం కలగనుందని ఏఈ క్రాంతి సింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో గుదిమళ్ల,వెంకటగి, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు, ఏదులాపురం గ్రామాల పరిధిలోని ఏరియాలు,వ్యవసాయబావులు,ఇండస్ట్రీలు, గృహవిద్యుత్‌కు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతారయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వాహనాల తనిఖీలు



ప్రజాపక్షం/వైరాః త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపద్యంలో వైరా ఏసిపి రెహమాన్ వైరాలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను పరిశీలించి ఏసిపి రెహమాన్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల నేపద్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజును ఆదేశించారు. ఈ సందర్భంగా ఏసిపి రెహమాన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ బాల్య, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిషరీస్ కళాశాల ఏర్పాటు చేయాలి




ప్రజాపక్షం/వైరాః వైరా నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ అనుబంధ ఫిషరీస్ కళాశాల ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వైరా నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కోట ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా మహాసభ చేసిన తీర్మానాలు బుధవారం బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యను ప్రోత్సహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను ధ్వంసం చేస్తుందన్నారు. వైరాలో ఇంటర్ తర్వాత అవసరమైన విద్యకు ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైరాలో ఫిషరీస్ కళాశబూల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వేమూరి అజయ్, హేమంత్, జశ్వంత్, సంతోష్, చరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష

**- ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం**
**- బిఆర్‌ఎస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి నామ**



**ప్రజాపక్షం/బోనకల్** : తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పాలనే శ్రీరామరక్షగా నిలిచిందని బిఆర్‌ఎస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం బోనకల్ మండలం జానకీపురం గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నామా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మళ్లీ మడో సారి గెలపించి పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కష్టకాలంలో నన్ను గెలిపించి కేసీఆర్‌కు అండగా ఉండాలని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. బిఆర్‌ఎస్ అభ్యర్థి నామా విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలని అన్నారు. జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ కష్టకాలంలో నామను మంచి మెజార్టీతో గెలిపించుకుని కేసిఆర్‌కు అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అందరూ సమైఖ్యంగా కలిసి పనిచేసి నామకు మెజార్టీ తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, బంధం శ్రీనివాసరావు, బాణోతు కొండ, మోదుగుల నాగేశ్వరరావు, జంగా రవి, తన్నీరు రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ నాల్గవ డివిజన్ పరిధిలోని స్వయంభూ శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 20వ వార్షిక బ్రహ్మోత్సవం ఈనెల తొమ్మిది నుంచి నిర్వహించ నున్నట్లు దేవాలయ కమిటీ బాధ్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లి కొమరయ్య, కార్యదర్శి పురం తిరపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్, ప్రధాన అర్చకులు నరగిరి నాధుని రామాచార్యులు మాట్లాడుతూ ఈనెల తొమ్మిదిన నుంచి 13 వరకు ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తొమ్మిదిన మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు జరుగుతాయని తెలిపారు. 10న బుధవారం నిత్యారాధన, మూల వరులకు అష్టోత్తర శత కలశ స్నపన (108 కళశాలతో అభిషేకం), 11న గురువారం విశేష అలంకరణ, స్వామి వారు ఎదుర్కోలు సంవాదం, స్వామి వారి కళ్యాణ మహోత్సవం, స్వామి గ్రామోత్సవం (ఊరేగింపు), సాయమారాధన, నిత్య హోమం, బలిహరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న శుక్రవారం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, సుదర్శన హోమ, నివేదన, నీరాజన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ, 13న శనివారం ఉదయం సుప్రభాత సేవ, జలక్రీడ ఉత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, మహాపుష్పాభిషేకం, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, అల్లిక అంజయ్య పాల్గొన్నారు.

# నర్సరీలు, ఉపాధి హామీ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** వేసవిలో నర్సరీలు సంరక్షణకు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని నర్సరీలో ఉన్న మొక్కలను సంరక్షణతో పాటు వాటికి ఎప్పటికప్పుడు నీరు అందించాలని నర్సరీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మొక్కలను ఇప్పుడు సంరక్షించినట్టయితే వర్షాకాలం సీజన్‌లో మొక్కలు నాటేందుకు వేపుగా ఎదుగుతాయని ఏపీడి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో నర్సరీలను పరిశీలించి అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు..మేడిదపల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించి మొక్కల సంరక్షణ చాలాబాగా ఉందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిలో మొక్కల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శి సాలే ఉపేందర్‌కు సూచనలు ఇచ్చారు. అనంతరం ఉపాధిహామీ కూలీ పనులను పరిశీలించి కూలీలకు ఎప్పటికప్పుడు తాగునీరు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని వద్ద టెంటు సమకూర్చాలని ఆమె తెలిపారు. కూలీలకు ప్రతిరోజువారి కూలిపడేందుకు పనులను చూయించాలని గ్రామాల్లో అవసరం ఉన్న పనులు చేయించాలని ఆమె తెలిపారు. ముఖ్యంగా వేసవిలో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు మంచినీటి బావుల పుడిక చేతి బోర్ల మరమ్మత్తులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈసీ అరుంధతి, పంచాయతీ కార్యదర్శులు సాలె ఉపేందర్ పాల్గొన్నారు.

# రాజకీయ పక్షాలతో అదనపు కలెక్టర్ సమావేశం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కల్లూరు ఆర్డీవోగా, ఏఆర్వో గా మధుసూదన్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మొదటిసారిగా కల్లూరు డివిజన్ సందర్శించారు. తహశీల్దార్ ఆఫీసులో సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పార్లమెంటు ఎలక్షన్లు, ఎమ్మెల్సీ ఎలక్షన్ల కార్యక్రమాలు వారికి వివరించారు. ఐదు మండలాల తహశీల్దార్‌లు, డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎలక్షన్లకు సంబంధించి విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్ తో సమావేశమై మోడల్ కోడ్ కండక్ట్ పటిష్టంగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్ , ఫస్ట్ , సిస్ట్ ఆఫీసర్లతో కూడా సమావేశమయ్యారు. ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బులు ఇతర ఎటువంటి అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రజలందరూ సి విజిల్, ఓటర్ హెల్ప్ లైన్ అప్స్ డౌన్‌లోడ్ చేసుకుని వాటి ప్రాముఖ్యత వివరించి ప్రజలు వాటిని సరైన రీతిలో ఉపయోగించుకునేలా చూడాలని చెప్పారు. తదుపరి జ్యోతి నిలయం నందు స్ట్రాంగ్ రూమ్‌ని పరిశీలించారు.

# సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు




**ప్రజాపక్షం/ మధిరః** మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ సిబిఎస్సీ స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ మెడల్స్, పట్టాలు అందించి ఉత్సాహపరిచారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్కూల్ టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని మధిర మున్సిపాల్టీలో పనిచేస్తున్న శానిటేషన్, వాటర్ వర్క్స్ కార్మికులకు మున్సిపల్ కమీషనర్ అహ్మద్ సఫీఉల్లా ఆధ్వర్యంలో ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మనోరమ మాట్లాడుతూ ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మున్సిపల్ కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ నరేష్‌రెడ్డి, డాక్టర్.రమాదేవి, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం తల్లాడ ఎస్సై బి.కొండలరావు తల్లాడ, అన్నారుగూడెం గ్రామాల సమీపంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్లు, తదితర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడ నుండి వస్తున్నారు.. వాటికి సంబంధించిన బిల్లులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ఎన్నికల నిబంధనలను విరుద్ధంగా నగదును తీసుకెళ్తే చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వాహనదారులందరూ తప్పనిసరిగా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కానిస్టేబుల్ మల్లికార్జున్, రంజిత్, సిబ్బంది ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం కొత్తవెంకటగిరి గ్రామానికి చెందిన కొలిపాక శ్రీనివాసరావు, లీలావతి దంపతుల కుమార్తె మౌనిక, నరేష్‌లకు బుధవారం జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకలకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించా రు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, ఎంపిటిసి రుద్రాక్ష బ్రహ్మం, ఇజం కృష్ణార్జునరావు, దివేల రామారావు, కిన్నెర నరేష్, షేక్.మురళీ, షేక్.బాబుసాహెబ్, కొలిపాక శ్రీనివాసరావు, దిరిశాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న డిఏలు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** ఇప్పటి వరకు నాలుగు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఐదవ డిఏ గడువు కూడా సమీపిస్తున్నదని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డిఏలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం బుధవారం పట్టణంలోని జవహర్ నగర్ లో సంఘ కార్యాలయం లో కేశవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా జిల్లా సంఘ అసోసియేట్ అధ్యక్షుడు వి. చెంచిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కమీషన్ అనుమతితో డిఏలు మంజూరు చేయవచ్చున్నారు. మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని కోరారు. మార్చి నెలనుండి ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయన్నారు. రిటైరైన వారికి రావలసిన బకాయిలు తక్షణమే అందచేయాలని కోరారు. బుధవారం జరిగిన ఈ కార్యవర్గ సమావేశంలో సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ లతోపాటు సంఘ నాయకులు ఏయస్.ప్రకాశరావు, బూరుగు దాసు, సాంబశివరెడ్డి, వాణి, కమల కుమారి, మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజాదరణ మరువలేనిది

- అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు
-పాల్వంచ పట్టణంలో విస్తృత పర్యటన
- అడుగడుగునా నీరాజనం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నియోజకవర్గ ప్రజల ఆధరణ మనువలేనిదని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మన్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు, కుంటినాగుల గూడెం, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, వెంగళరావు కాలనీ, బొల్లోరు గూడెం, టీచర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనపై నమ్మకంతో అసాధారణ విజయాన్ని అందించారని, మీ ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నడు చూడని విధంగా ముందుకు తీసుకెళతానని చెప్పారు. ఏ పనిచేసినా అది శాశ్వతంగా నిలిచిపోయాలా చేసుకుందామని, ప్రజల మౌళిక సదుపాయాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతీ వార్డులో, ప్రతి పల్లెలో డ్రైనేజీలు, రోడ్లు, అంతర్గత రోడ్లు, తాగు నీటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్దం చేశామని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు మొదలు పెట్టు



కుందామన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో ప్రజలు కూనంనేనికి నీరాజనాలు పట్టారు. పూలమాలలువేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు , ఉప్పుశెట్టి రాహూల్, చెరుకూరి శేఖర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శేనగరపు శ్రీనివాసరావు, జకరయ్య, ఎస్కె పాషా, ఆదిన్నారాయణ, అప్సర్, లక్ష్మి, ప్రసాద్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 18 సం. నిండిన ప్రతీ వారూ ఓటు హక్కును విధిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో 5 కె రన్ నిర్వహించారు. కొత్తగూడెం పోస్టాఫిస్ సెంటర్ వద్ద ఎస్పి రోహిత్ రాజ్‌తో కలిసి ఆమె పచ్చ జెండా ఊపారు.ఈ ర్యాలీ రైల్వేస్టేషన్ మీదుగా మార్కెట్ యార్డ్ వరకు సాగింది. ఇందులో ఉద్యోగులతో పాటు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితాలో పేరున్న ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కళాజాతాలు, ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు వేయాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేది నాటికి 18 సం. నిండే ప్రతీ ఒక్కరూ ఈనెల 15లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఓటు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ విద్యాచందన, ఏఆర్ఓ కాశయ్య, జిల్లా అటవీ అధికారి కృష్ణగౌడ్, పలు శాఖలకు చెందిన అధికారులు పరందామరెడ్డి, ప్రసూనారాణి, జానయ్య, మనోహర్, సంజీవరావు, గన్య, ధారా ప్రసాద్‌తో పాటు తదితరతులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రానున్న పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా జరిగే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అన్నారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా పాటిస్తూ సహకరించాలన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాను సారం అదనపు ఇవిఎంలు కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదీ దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ధారా ప్రసాద్, రంగ ప్రసాద్, సుశీల్, నవీన్, పలు పార్టీల నుండి రాంబాబు, నోముల రమేష్, ఎర్ర కామేష్, నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్మారియా తదితరులు పాల్గొన్నారు.

# ములకలపల్లిలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ ధర్మ రక్షా నిధి, ఉగాది ఉత్సవాలు, రామోత్సవాలు, వీర హనుమాన్ విజయ యాత్ర, నూతన గ్రామ కమిటీల నిర్మాణం, నూతన సత్సంగాల ప్రారంభం, క్షేత్ర విశ్వహిందూ పరిషత్ శిక్షా వర్గకి సంఖ్యా ప్రయత్నం, బజరంగ్దళ్ ప్రాంత వర్గకి సంఖ్యా ప్రయత్నం, దుర్గావాహిని ప్రాంత వర్గకి సంఖ్యా ప్రయత్నం పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగాధరి సీత, జిల్లా సామాజిక సమరసతా ప్రముఖ్ గొడ్ల రాజయ్య, ములకలపల్లి ప్రఖండ అధ్యక్షులు కారంపూడి సత్యనారాయణరాజు, ప్రఖండ సహ కార్యదర్శి కీసరి వీరభద్రం, ప్రఖండ ఉపాధ్యక్షులు పువ్వాల శ్రీనివాస్, బత్తుల సీతారాములు, తదితరులు పాల్గొన్నారు. ఈసమావేశంలో ప్రఖండలో నూతన బాధ్యతలను జిల్లా కార్యదర్శి గంగాధరి సీత ప్రకటించారు. మండల నూతన బాధ్యతలు ప్రఖండ కార్యదర్శిగా కీసరి వీరభద్రం, ప్రఖండ ఉపాధ్యక్షులుగా బత్తుల సీతారాములు తదితరులు ఉన్నారు.

# విజయ్ గాంధీని పరామర్శించిన బలరాం నాయక్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత 10 రోజులుగా తీవ్ర జ్వరం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ్‌గాంధీని పోలవరం గ్రామంలోని ఆయన స్వగృహం నందు బుధవారం నియోజకవర్గ పర్యటన నిమిత్తం విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్ధి పోరిక బలరాం నాయక్ ఆత్మీయంగా పరామర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మొదటి సారి వారింటికి విచ్చేసిన బలరాం నాయక్‌ని శాలువాతో సత్కరించి, ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు.

# చిన్నారులను ఆశీర్వదించిన జెడ్పిటిసి శ్రీలత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని ముసలమడుగు గ్రామానికి చెంది న కామేళ్ళ నరేష్, ఉమా దంపతుల కు మార్తైలు సౌమ్య, హారికల ఓణీల అలంకరణ వేడుకకు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత బుధవారం హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బొర్ర రాఘవులు, పార్టీ నాయకులు కుర్సం వెంకన్న, పలువురు నాయకులు, వారి బంధు మిత్రులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర చెక్ పోస్ట్‌ను పరిశీలించిన సిఐ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు గ్రామంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల అంతరాష్ట్ర చెక్ పోస్ట్‌ను బుధవారం పాల్వంచ సిఐ వినయ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ 50వేలకు మించి నగదు తీసుకెళ్ల కూడదని, ఒక వేళ నగదు తీసుకెళ్లే అవసరం ఉంటే సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈతనిఖీల్లో అదనపు ఎస్ఐలు నాగభిక్షం, ఏసోబు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# పోడు నరికితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అటవీ ప్రాంతం లో పోడు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎఫ్‌వో కృష్ణ గౌడ్ అన్నారు. బుధవారం బెండాలపాడు గ్రామ శివారులో గల అటవీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అదే విధంగా కీర్తిశేషులు ఫారెస్ట్ రేంజర్ చలమల శ్రీనివాసరావు పేరుతో ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో 25 ఎకరాల్లో ప్లాంటేషన్ మొక్కల నాటాలనే లక్ష్యం పెట్టుకుందామని తెలిపారు. ప్లాంటేషన్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని తెలిపారు. భావితరాల కోసం అడవులు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈకార్యక్రమంలో రేంజర్ ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం



-గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు
-పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. వందల ఎకరాల భూములు కబ్జాకు గురైన రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్యాక్రాంతమైన భూములను స్వాధీనపర్చుకుని రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ పాలేరు నియోజక వర్గ పరిధిలోని తిరుమలాయపాలెం మండలంలో రెవెన్యూ శాఖాధికారులు మాత్రం భూములను కాపాడడంలో విఫలమయ్యారు. గత ప్రభుత్వంలో చూసి చూడనట్లుగా వ్యవహరించిన అధికారులు ప్రభుత్వం మారిన కూడా అదే రీతిలో వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. మండల పరిధిలోని సుబ్లేడు రెవెన్యూ పరిధిలో 605 ఎకరాల చెరువు విస్తీర్ణం కాగా 262 ఎకరాల్లో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ఇక్కడి చెరువులోనే వంద ఎకరాల భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. చెరువులోకి కాలువ ద్వారా వచ్చే నీళ్లు కూడా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. మాదిరిపురం సర్వే నెం. 189, బచ్చోడో సర్వే నెంబరు 357 తో పాటు పిండిప్రోలు, హస్నాబాద్, కాకరవాయి, సుబ్లేడు, పాతర్లపాడు, కొక్కిరేణి, తిమ్మక్కపేట, బీరోలు, పైనంపల్లి, మేడేపల్లి గ్రామాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో నిరుపేదలకు వారి జీవనోపాధి కోసం ప్రభుత్వం వ్యవసాయం చేసుకునే వారికి భూములను పంచింది. అట్టి భూములను తప్పుడు ధృవపత్రాలతో కబ్జాదారులు లాక్కున్నారు. మాదిరిపురం స్టేజీ సమీపంలో 189 సర్వే నెంబరులో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాదారులు యధేచ్ఛగా ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఒక్క సర్వే నెంబరుకు బదులు మరో సర్వే నెంబరును సృష్టించి ఒక ప్లాట్లును నలుగురు, ఐదుగురికి విక్రయించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కాయ కష్టం చేసి కూడబెట్టుకున్న రూపాయిలతో అక్కరకు వస్తుందని స్థలాలు కొనుగోలు చేసిన బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. భూములు కొనుగోలు చేసిన పేదలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పలు గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో చెరువు శిఖం భూములను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరి కొన్ని గ్రామాల్లో దేవుని ఈనాం భూములు కూడా ఆక్రమణకు గురైనట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామాల పేరుతో పలువురు నాయకులు అధికారులను ప్రలోభపెట్టి పట్టాలు చేయించుకున్నట్లు సమాచారం. పలువురి రైతులకు సంబంధించిన భూములను కూడా ఇతరుల పేరు మీదకు మార్చినట్లు రైతులు వాపోతున్నారు. తమ పేరు మీద భూములు లేకపోవడంతో రైతు బంధు, రైతు బీమా, బ్యాంకుల్లో రుణాలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్యాక్రాంతమైన భూములను కాపాడడంతో పాటు ధరణిలో లోపాలను సరి చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సైతం ఎన్నికల సమయంలో ఇదే మాటను చెప్పారు. కానీ రెవెన్యూ అధికారులు అన్యాక్రాంతమైన భూములను కాపాడడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రులు దృష్టి సారించి తిరుమలాయపాలెం మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి మీకు లేదు..

**ప్రజాపక్షం/మణుగూరు:** కాంగ్రెస్ పార్టీ విమర్శించే స్థాయి మీది కాదని అశ్వాపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాదె కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఒక ప్రకటనలో పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ మంత్రులపై, కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మతిస్థిమితం కోల్పోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ మిమ్మల్ని ఆనాడు గుర్తించి 2009, 2018లో మిమ్మల్ని గెలిపించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మర్చిపోయారా మీరు ఈరోజు ఈ స్థాయిలో ఉన్నారంటే అది కాంగ్రెస్ పార్టీ మీకు పెట్టిన బిక్ష అని మర్చిపోకండి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి నీకు లేదని మండిపడ్డాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీల్లో ఐదు గ్యారెంటీలు అమలు చేయడం పై ప్రజల్లో ప్రభుత్వంపై వస్తున్న అశేష స్పందనను ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ మంత్రులపై విమర్శిస్తావా అని అన్నారు. ఇప్పటికే నీ ప్రభుత్వాన్ని నిన్ను జనాలు తరిమికొట్టిన సంగతి మర్చిపోయావా అన్నారు. ఆనాడు కెసిఆర్ కి ఇవే చివరి గడియలు అన్న మీరేనా మాట్లాడేది అని అన్నారు. రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి ప్రజలే మీకు తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెలమడుగు ఎంపీటీసీ బేతం రామకృష్ణ, ఉపాధ్యక్షులు కాక రాములు, ప్రధాన కార్యదర్శిలు తూము పెద్ద వీరరాఘవులు, చెంచల రాము, ట్రెజరరీ నరసింహారావు, బీసీ సెల్ అధ్యక్షుడు బచ్చు వెంకట రమణ, మైనార్టీ అధ్యక్షుడు ఎస్కే మోసిన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లినేని సురేష్, బారాజు సంపత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్ ఆవుల రవి,శ్రీకాంత్, కుంజ జాను, ఎంహెచ్పీ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మక్కిన యోజి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/మణుగూరు:** సంతోష్ నగర్ శ్రీ విద్యాభ్యాస (బాలవెలుగు) పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం మక్కిన యోజి (యామిని) జయంతి వేడుకలు కుటుంబ సభ్యులు, మణుగూరు ఏరియా ఎంఎంసీ లబ్ధిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఏరియా మంత్లీ మానిటరీ కాంపన్ సేషన్ (ఎం ఎం సి)లబ్ధిదారుల ఆధ్వర్యంలో శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు క్వింటా, అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి క్వింటా బియ్యం మొత్తం రెండు క్వింటాళ్ల బియ్యం వితరణ మరియు సంఘం అధ్యక్షురాలు మేదరి పద్మ ఏడు వేల రూపాయల విలువ గల బావిలో నీరు తోడే మోటార్ ను వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. యోజీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్త మిడిదొడ్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మణుగూరు సమీప గ్రామాలలోని అనాధలు అన్నార్తులను చేరదీసి విద్యాభ్యాసం చేపించటం పట్ల పాఠశాల నిర్వహకులను ఆయన అభినందించారు. సుమారు 22 వేల రూపాయలు ఖర్చుపెట్టి చక్కటి కార్యక్రమం నిర్వహించిన ఎం ఎం సి లబ్ధిదారులను యోజి కుటుంబ సభ్యులను ఆయన ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా యోజి చిత్రపటానికి నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త యస్ డి నా సర్ పాషా కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించగా ఎం ఎం సి లబ్ధిదారులు మేదరి పద్మ, కుర్సా బాయమ్మ, నాగపురి కౌసల్య, భూక్య గౌరీ, చల్లా పద్మ, సామాజిక కార్యకర్త ఏ మంగి లాల్, మిడిదొడ్ల సంతోష్, మేదరి పవన్ శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి జగన్ మోహన్ రెడ్డి, ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమం నిర్వాహకులు షేక్ మెహరాజ్, సిబ్బంది సుహాసిని, దేవి, రాధా తదితరులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్‌కు ఆరు పరీక్షా కేంద్రాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా ఎన్‌టిఏ నిర్వహించే జెఈఈ మెయిన్స్, బిఆర్క్ రెండవ విడత 2024 పరీక్షలకు గాను ఖమ్మంజిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేసినట్లు జిల్లా కో ఆర్డినేటర్ ఆర్. పార్వతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 నుండి 9వ తారీఖు వరకు ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టులుగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జెఈఈ మెయిన్స్ పరీక్షకు 5,296 మంది విద్యార్థులు, 12న జరిగే బిఆర్క్ పరీక్షకు 884 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం షిఫ్ట 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు వారికి కేటాయించిన సమయం ప్రకారం హాల్ టికెట్‌లో ఉన్నవిధంగా గంటన్నర ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో పొందుపరిచిన అన్ని జాగ్రత్తలు, సూచనలు పాటించి పరీక్షలు రాయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు కో ఆర్డినేటర్ పార్వతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# సాయిస్ఫూర్తి విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** బిటెక్ రెండవసంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాలు బుధవారం జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ ఫలితాల్లో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచి కళాశాల ఘనతను పునరావృతం చేసారని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ దాసరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బ్రాంచీల వారీగా విద్యార్థులు సాధించిన ఫలితాలు ఇలా ఉన్నాయి. ట్రిపుల్ ఈఈఈ షేక్. రహీమత్ పాషా 8.75/10, కనపర్తి. గోపీచంద్7.9/10 ఎస్జిపిఏస్ సాధించారు. మెకానికల్ ఇంజనీరింగ్ మోరంపూడి హిమంత్ 7.1/10, ఈసిఈ లో మానికల సాయి 8/10, తొర్లపాటి రమ్య 7.95/10, సియస్ సి లో తడికమల్ల పుష్పలత 8.85/10, గరిడేపల్లి సాయిసునంద 8.70/10, సియస్ యం లో చిరుమామిళ్ల వర్షిణి 9.7/10, షేక్. సమీరా 9.55/10, ఎఐడి ఎస్ లో పందిటి తేజ శ్రీ 9.05/10, చెన్ను సాయి మైథిలి 8.75/10, జలదాని శివశశాంక 8.75/10, సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ అవేరేజ్ ఎస్ జి పి ఎ తో బ్రాంచీల వారీగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు మరియు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్ గా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ,విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ పరిధిలో మంచి అకాడమిక్ ఎక్సలెన్స్ ను సాధించే బహుకొద్ది కళాశాలల్లో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఒకటన్నారు. ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు మొదలగు వారు విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# క్రీడలతోనే స్నేహభావం



**ప్రజాపక్షం/కామేపల్లి:** క్రీడలతో స్నేహభావంతోపాటు, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూత్, బోడేపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగు మండలాల క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, యువత ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను ఎంచుకొని ప్రతిభను కనపర్చాలన్నారు. జాతీయ క్రీడలను గ్రామ స్థాయికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, సొసైటీ చైర్మన్ జి రాంబాబు, ఎంపిటిసి నల్లమోతు లక్ష్మయ్య, జిల్లా నాయకులు ఏపూరి మహేందర్‌కుమార్, దమ్మలపాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మాలోత్ నరీరాంనాయక్, మాజీ సర్పంచ్ మాలోత్ మున్నానాయక్, నల్లమోతు వెంకటనర్సయ్య, కమిటీ సభ్యులు వల్లభనేని అశోక్, గోపికృష్ణ, మాలపోతు చంద్రశేఖర్, సునీల్, డి ప్రేమ్, లింగరాజు, డి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీకి వేసవి సెలవులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అంగన్వాడీ సెంటర్స్‌లో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆళ్లపల్లిలో అంగన్వాడీ టీచర్స్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చిన్నారులు, గర్భిణీ, బాలింతలు ఎండలో అంగన్వాడీ కేంద్రంకు వచ్చే పరిస్థితి లేదన్నారు. అన్ని సెంటర్‌లో కరెంట్ లేదు, త్రాగునీరు లేని కేంద్రాలు, అదే విధంగా మౌళిక వసతులు లేవని ఈ కారణంగా ఎండలు తీవ్రంగా వస్తున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలి పిల్లలు ఇబ్బందులు పడే ప్రమాదంపందని, లబ్దిదారుల రక్షణ కోసం మానవత దృష్టిలో అలోచించి తక్షణమే వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ సీతామహాలక్ష్మీ, జిల్లా కార్యదర్శి వి మల్లికార్జున్, అనుముల సాయి, సుజాత, విమల, లలిత, చంద్రకళ, కళావతి, లత తదితరులు పాల్గొన్నారు.